బడంగ్‌పేట్-బాలాపూర్ రోడ్డును బాగు చేయండి



గుంతలమయమైన బడంగ్‌పేట్-బాలాపూర్ రోడ్డును పరిశీలిస్తున్న పారిజాతారెడ్డి

సరూర్‌నగర్, జూలై 28(ఆంధ్ర జ్యోతి): బడంగ్‌పేట్-బాలాపూర్ గ్రామాల మధ్య గల లింకు రోడ్డు పూర్తి అధ్వానంగా తయారయిందని, వెంటనే సదరు రోడ్డు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని బడంగ్‌పేట్ మాజీ మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి అధికారులను కోరారు. సోమవారం ఆమె నాదర్‌గుల్ 31వ డివిజన్‌లోని శాంతినగర్, లక్ష్మీనగర్ కాలనీల్లో పర్యటించి అక్కడి సమస్యలను తెలుసుకున్నారు. కొంత కాలంగా డ్రైనేజీ రోడ్లపై పారుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆమెకు ఫిర్యాదు చేశారు. దాంతో ఆమె వెంటనే మునిసిపల్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌గుప్తా, గిరిముదిరాజ్, శివకుమార్ పాల్గొన్నారు.



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

వనస్థలిపురం, జూలై 28(ఆంధ్రజ్యోతి): వనస్థలిపురం డివిజన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. డివిజన్‌లోని మల్లికార్జుననగర్ కాలనీ, శ్రీనివాసపురం కాలనీల్లో పలు అభివృద్ధి పనుల కు ఆయన సోమవారం శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని 43 కాలనీల్లో నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తున్నానన్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, ప్రధాన కార్యదర్శులు నిరంజన్, రాజేందర్‌రెడ్డి, కోశాధికారి ఎండీ షరీఫ్, ఉపాధ్యక్షుడు సాయిచరణ్, క్రిస్టియన్‌కాలనీ అధ్యక్షుడు హరిందర్‌రెడ్డి పాల్గొన్నారు.

కాలనీలకు నిధులు మంజూరు చేయండి



జెడ్సీకి సమస్యలు వివరిస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

కొత్తపేట, జూలై 28(ఆంధ్ర జ్యోతి): కొత్తపేట కాలనీల సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు చేయాలని జీహెచ్ఎంసీ ఎల్బీనగర్ జెడ్సీ హేమంత్ కేశవ్ పాటిల్‌కు కార్పొరేటర్ పవన్‌కుమార్ విన్నవించారు. సోమవారం ఆయన జెడ్సీని కలిసి సమస్యలు వివరించారు. వర్షాలతో డ్రైనేజీ వ్యవస్థ, అంతర్గతదారులు పాడయ్యాయన్నారు. పలు కాలనీల్లో నూతన సీసీ రోడ్లు వేసేందుకు సత్వరమే నిధులు మంజూరు చేయాలని కోరారు.

బస్తీ దవాఖానాలో మెరుగైన వైద్యం అందాలి



బస్తీ దవాఖాన అభివృద్ధి కమిటీ సమావేశంలో కార్పొరేటర్ అరుణారెడ్డి

సైదాబాద్, జూలై 28(ఆంధ్రజ్యోతి): బస్తీ దవాఖానాలకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని కార్పొరేటర్ కొత్తకాపు అరుణారెడ్డి తెలిపారు. సోమవారం జాకీర్ హుస్సేన్ కాలనీలోని బస్తీ దవాఖాన అభివృద్ధి కమిటీ సమావేశానికి కార్పొరేటర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సిబ్బంది సమయపాలన పాటించాలని, మందులు అందుబాటులో ఉండాలని కోరారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ బీర్జున్నీసా, రవికాంత్, తరుణి, ఫాతిమా, మలేరియా, ఎంటమాలజీ సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ శ్వేతారెడ్డి

సైదాబాద్, జూలై 28(ఆంధ్రజ్యోతి): ఐఎస్‌సదన్ డివిజన్‌లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానని కార్పొరేటర్ జంగం శ్వేతారెడ్డి తెలిపారు. సోమవారం సుబ్రమణ్యంనగర్ కాలనీలో నూతన బోరు పనులు, రాజరాజేశ్వరీనగర్‌లో నల్లపోచమ్మ ఆలయ ప్రహరీ గోడ నిర్మాణ పనులను కార్పొరేటర్ ప్రారంభించారు. కార్యక్రమంలో బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు జంగం మధుకర్‌రెడ్డి, జీహెచ్ఎంసీ ఏఈ శిరీష, కాలనీవాసులు సందీప్‌సాగర్, యాదయ్యగౌడ్, గోపాల్, శివరాజ్, పెంటయ్య, విఠల్, సాగర్, శ్రీను పాల్గొన్నారు.

సులభ్ కాంప్లెక్స్ నిర్మించాలి



వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

ఓల్డ్‌మలక్‌పేట, జూలై 28(ఆంధ్ర జ్యోతి): ఓల్డ్‌మలక్‌పేట రేస్‌కోర్సు రోడ్డు లో ఉన్న మటన్ మార్కెట్ ఆవరణలో సులభ్ కాంప్లెక్స్ నిర్మించాలని కోరుతూ సోమవారం ఎంఐఎం మలక్‌పేట డివిజన్ అధ్యక్షుడు ఎండీ షఫీయుద్దీన్‌కు వినతిపత్రం ఇచ్చారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో గ్రేటర్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు బాబు శ్రీనివాస్, స్థానిక నాయకుడు చౌకి రవికుమార్ తదితరులున్నారు.



గోదాదేవి అమ్మవారి గుడి వద్ద విష్ణుసహస్రనామ పారాయణం చేస్తున్న భక్తులు

గోదాదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు

కొత్తపేట, జూలై 28(ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసోత్సవాల్లో భాగంగా కొత్తపేట ఆలయాల్లో స్వామివార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తున్నారు. సోమవారం గోదాదేవి అమ్మవారి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని శాస్త్రోక్తంగా నవకలశ అభిషేకం చేశారు. అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు, అర్చనలు చేయించారు. రాత్రి భక్తులు విష్ణు సహస్ర నామపారాయణం చేశారు.

రెడ్డి జాగృతి తెలంగాణ అధ్యక్షుడిగా జగన్మోహన్‌రెడ్డి



హయత్‌నగర్ : తెలంగాణ రెడ్డి జాగృతి అధ్యక్షుడిగా హయత్‌నగర్ అరుణోదయనగర్ కాలనీకి చెందిన గుజ్జ జగన్మోహన్‌రెడ్డి ఎంపికయ్యారు. సోమవారం హయత్‌నగర్‌లో జరిగిన తెలంగాణ రెడ్డి జాగృతి రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో జగన్మోహన్‌రెడ్డిని అధ్యక్షుడిగా, మహిళా విభాగం అధ్యక్షురాలిగా నందికొండ గీతారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా మందాడి కరుణారెడ్డిని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా రెడ్డి జాగృతి వ్యవస్థాపక అధ్యక్షుడు పిట్ట శ్రీనివాస్‌రెడ్డి చేతుల మీదుగా వారు నియామక పత్రాన్ని అందుకున్నారు.



సరూర్‌నగర్‌లో ఫలహారం బండి ఊరేగింపులో అందెల శ్రీరాములుయాదవ్, కార్పొరేటర్ రాధాధీరజ్‌రెడ్డి, రాజ్‌భూపాల్‌గౌడ్



జ్యోతిక్లబ్ ఆధ్వర్యంలో ఫలహారం బండి ఊరేగింపులో మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్, మల్కాజిగిరి కుమార్, దయానిధి తదితరులు



చంచల్‌గూడలోని ముత్యాలమ్మ అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ చైతన్యకుమార్

ఘనంగా ఫలహారం బండి ఊరేగింపు

ఎల్బీనగర్, జూలై 28(ఆంధ్రజ్యోతి): లింగోజిగూడ, సరూర్‌నగర్, ఆర్‌కేపురం ప్రాంతాల్లో ఫలహారం బండ్ల ఊరేగింపు సోమవారం ఘనంగా నిర్వహించారు. డప్పు వాయిద్యాలు, పోతరాజుల నృత్యాల నడుమ అమ్మవారి ఫలహారం బండ్ల ఊరేగింపు లింగోజిగూడ, సరూర్‌నగర్, ఆర్‌కేపురం తదితర ప్రాంతాల్లో కనులపండువగా సాగింది. లింగోజిగూడలో జ్యోతిక్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫలహారం బండి ఊరేగింపులో పీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్, రోడ్డు అభివృద్ధి సంస్థ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, మాజీ కార్పొరేటర్ ముద్రబోయిన శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు. సరూర్‌నగర్ పోస్టాఫీస్ చౌరస్తా వద్ద బీజేపీ యువ నాయకుడు సాతెల్లి సాయినాథ్ ఆధ్వర్యంలో ఫలహారం బండి ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు అందెల శ్రీరాములుయాదవ్, ధీరజ్‌రెడ్డి, బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు రాజ్‌భూపాల్ గౌడ్, కార్పొరేటర్లు రాధాధీరజ్‌రెడ్డి, బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఆరుట్ల సురేష్, జీహెచ్ఎంసీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.



చంచల్‌గూడలో కళా బృందాల సాంస్కృతిక విన్యాసాలు

చంచల్‌గూడ పిల్లిగుడిసెల కాలనీలో..

చాదర్‌ఘాట్ : చంచల్‌గూడలోని పిల్లిగుడిసెలు డబుల్ బెడ్‌రూం గృహ సముదాయంలో ముత్యాలమ్మ అమ్మవారి బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ చైతన్యకుమార్ అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సైదాబాద్ కార్పొరేటర్ అరుణారెడ్డి, జలమండలి సీజీఎం వినోద్ భార్గవ్, మీరాలం మండి ఆలయం కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య పాల్గొన్నారు.

హయత్‌నగర్ : వినాయకనగర్ కాలనీలో నక్క వెంకటేష్‌గౌడ్, రాకేష్ గౌడ్, రాజేష్ ఆధ్వర్యంలో ఘనంగా ఫలహారం బండిని ఊరేగించారు. ఈ సందర్భంగా మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, మన్సూరాబాద్, హయత్‌నగర్ కార్పొరేటర్లు కొప్పుల నర్సింహారెడ్డి, కళ్లెం నవజీవన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకులు కొత్త రవీందర్‌గౌడ్, కళ్లెం రవీందర్‌రెడ్డిలు అమ్మవారిని దర్శించుకుని ఊరేగింపులో పాల్గొన్నారు. ఊరేగింపు హయత్‌నగర్ ఓల్డ్‌విలేజీ నుంచి బాతుల చెరువు వరకు నిర్వహించి నిమజ్జనం చేశారు.



హయత్‌నగర్ వినియకనగర్‌కాలనీలో ఊరేగిస్తున్న ఫలహారం బండి

సైదాబాద్ : శంకేశ్వర్‌బజార్ సాయిరాంనగర్ బస్తీ లో తొట్టెల ఊరేగింపు డప్పు వాయిద్యాల నడుమ సాగిం ది. బీఆర్ఎస్ సైదాబాద్ డివిజన్ అధ్యక్షుడు పగిల్ల శ్రీనివాస్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

చంపాపేట : చంపాపేట డివిజన్ బైరామల్‌గూడ ప్రగతినగర్‌లో ఫలహారం బండి ఊరేగింపు శివ, రాము ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ సీనియ ర్ నాయకుడు బొక్కా సదానంద్‌రెడ్డి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఊరేగింపులో పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్



వైద్యులతో మాట్లాడుతున్న సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్

మల్కాజిగిరి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని, ఆస్పత్రిలో వైద్యులు 24 గంటలూ అందుబాటులో ఉండాలని సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్ ఆదేశించారు. సోమవారం మల్కాజిగిరి ఏరియా ప్రభుత్వ ఆస్పత్రిని అదనపు కలెక్టర్ రాధికగుప్తాతో కలిసి సందర్శించి వైద్యులకు పలు సూచనలు చేశారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సుఖ ప్రసవాలను ప్రోత్సహించాలని, ఓపీ సేవలను మరింత విస్తృతం చేయాలని, టీబీ ముక్త్ భారత్‌లో భాగంగా స్ర్కీనింగ్, ఎక్స్‌రే సేవలను ప్రజలకు అందించాలని సూచించారు. ఫీవర్ క్యాంపులను పెంచాలని, డెంగీ కేసుల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. వృద్ధుల వార్డు, జిల్లా క్యాన్సర్ సెంటర్, పీడియాట్రిక్ వార్డు, ఔట్ పేషెంట్ వార్డులను దివ్యదేవరాజన్ పరిశీలించి వారికి అందుతున్న వైద్య సదుపాయాలపై ఆరా తీశారు. ఆపరేషన్ థియేటర్లను పరిశీలించిన ఆమె ఆస్పత్రిలో జరుగుతున్న ప్రసవాలు, శస్త్ర చికిత్సల సంఖ్య, ఫార్మసీలో మందుల నిల్వలు, ఔషధి పోర్టల్ పనితీరును సమీక్షించారు. డీఎంహెచ్ఓ ఉమాగౌరి, వైద్యాధికారులు పాల్గొన్నారు.

స్పెషల్ బీఈడీ అభ్యర్థులకు 100శాతం రిక్రూట్‌మెంట్‌తో ఉద్యోగ నియామకాలు చేపట్టాలి



డైరెక్టర్ శైలజకు వినతిపత్రం ఇస్తున్న దివ్యాంగ సంఘాల నాయకులు

ఓల్డ్‌మలక్‌పేట, జూలై 28(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు తీర్పు ఆదేశాల మేరకు దివ్యాంగ పిల్లలకు బోధించే స్పెషల్ బీఈడీ ఉద్యోగ నియామకాల్లో 100శాతం రిక్రూట్‌మెంట్ కల్పించాలని కోరుతూ సోమవారం భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో వికలాంగుల సంక్షేమశాఖ డైరెక్టర్ బి.శైలజను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సమితి రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేశ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 2024లో చేపట్టిన డీఎస్సీ నియామకాల్లో ప్రత్యేక అవసరాలు కలిగి ఉన్న విద్యార్థులకు బోధించే స్పెషల్ బీఈడీ అభ్యర్థులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. జీఓ 97 కారణంగా నష్టపోయిన స్పెషల్ బీఈడీ అభ్యర్థులకు ప్రమోషన్‌లో కేటాయించిన 507 పోస్టులకు గాను 126 మందికి అవకాశాలు కల్పించగా మిగిలిన 381 పోస్టులకు స్పెషల్ డీఎస్సీలో అర్హత సాధించి ఉన్న అభ్యర్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించి స్పెషల్ బీఈడీ అభ్యర్థులకు న్యాయం చేయాలని వినతిపత్రంలో ప్రభుత్వాన్ని కోరినట్లు తెలిపారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో కె.యాదయ్య, డి.కృష్ణ, డి.సతీష్, జి.రమేష్, లక్ష్మణ్, బక్కయ్య, జగన్, బ్రహ్మయ్య, కేశవ్, శ్రీశైలం ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

చాదర్‌ఘాట్, జూలై 28(ఆంధ్ర జ్యోతి): లారీ, బైకు ఎదురెదురుగా ఢీకొని బైకు నడుపుతున్న గుర్తుతెలియని వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన సరూర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొత్తపేట సర్వీస్ రోడ్డులోని వీఎం హోమ్ మెట్రో స్టేషన్ సమీపంలో సోమవారం జరిగింది. వివరాల ప్రకారం.. గుర్తు తెలియని వ్యక్తి ఎల్బీనగర్ నుంచి దిల్‌సుఖ్‌నగర్ వైపు బైకుపై వెళ్తుండగా అదే రోడ్డులో ఎదురుగా వేగంగా వెళ్తున్న లారీ బైకును ఢీకొట్టింది. దీంతో బైకు నడుపుతున్న గుర్తుతెలియని వ్యక్తికి తీవ్రగాయాలు కావడంతో అత డు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి వివరాలు తెలియకపోవడంతో గుర్తు తెలియని మృతదేహంగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

యువతి అదృశ్యం



ఇరుగు మౌనిక

హయత్‌నగర్, జూలై 28(ఆంధ్ర జ్యోతి): యువతి అదృశ్యమైన సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దఅంబర్‌పేట్ లక్ష్మారెడ్డిపాలెంలో నివాసం ఉండే పత్తిపురం మీనమ్మ కూతురు ఇరుగు మౌనిక (25)కు గత సంవత్సరం ఇరుగు రాజుతో వివాహం జరిగింది. భార్య భర్తల మధ్య గొడవ రావడంతో కొంత కాలంగా మౌనిక తల్లి వద్దనే ఉంటుంది. ఆదివారం ఉద యం మౌనిక బయటకు వెళ్లి వస్తానని చెప్పి వెళ్లింది. రాత్రి అయినా ఇంటికి రాక పోవడంతో తల్లి మీనమ్మ ఫోన్‌చేస్తే స్విచ్ఛాఫ్ అని వచ్చింది. దీంతో తెలిసిన వారి వద్ద విచారించినా ఫలితం లేకపోవడంతో సోమవారం సాయంత్రం మీనమ్మ తన కూతురు కనిపించడం లేదని హయత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అప్రమత్తతతోనే హెపటైటిస్ వ్యాధి దూరం

● కామినేని ఆస్పత్రి వైద్యులు



వివరాలు వెల్లడిస్తున్న కామినేని ఆస్పత్రి వైద్యులు

మన్సూరాబాద్, జూలై 28(ఆంధ్రజ్యోతి): మానవ శరీరంలో ఎంతో కీలకమైన కాలేయానికి వాపు వచ్చిందంటే హెపటైటిస్‌కు దారితీసినట్టేనని, ఈ వ్యాధిని అప్రమత్తతతోనే నివారించుకోవచ్చని ఎల్బీనగర్‌లోని కామినేని ఆస్పత్రి వైద్యులు పేర్కొన్నారు. ప్రపంచ హెపటైటిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆస్పత్రి ఆవరణలో సోమవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్యాస్ట్రో ఎంటరాలజిస్టు వైద్యులు డాక్టర్ వీఆర్ సుమంత్‌కుమార్, డాక్టర్ తేజస్విని తుమ్మ, లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ సర్జన్ డాక్టర్ ఏవీ కృష్ణచైతన్యలు మాట్లాడారు. హెపటైటిస్ వ్యాధి ఏ,బీ,సీ,డీ,ఈ అని ఐదు రకాలుగా ఉంటుందని, ఇందులో బీ, సీ రక్త మార్పిడి, ఒకే సూదితో ఇద్దరికంటే ఎక్కువ మందికి పచ్చబొట్లు వేయడం, అరక్షిత శృంగారం ద్వారా సంక్రమిస్తుందన్నారు. చిన్న నుంచి పెద్దల వరకు వ్యాపించే ఈ వ్యాధిని సరైన సమయంలో గుర్తించి చికిత్స చేయించుకుంటే నయం చేయవచ్చన్నారు. ఈ వ్యాధికి సంబంధించిన వైద్య పరీక్షలు, శస్త్ర చికిత్సలపై ఆగస్టు 2 వరకు కామినేని ఆస్పత్రి ద్వారా రాయితీ ప్యాకేజీని వైద్యులు ప్రకటించారు. ఇతర వివరాలు, అపాయింట్‌మెంట్‌కై సెల్ 7036270362 నంబర్ ద్వారా సంప్రదించాలని సూచించారు.

పదవి ముగిసినా మోజు తగ్గలే..!

● వాహనాలపై నేటికీ 'కార్పొరేటర్' పేరు

● కమిషనర్‌కు కాంగ్రెస్ నేతల ఫిర్యాదు

సరూర్‌నగర్, జూలై 28(ఆంధ్రజ్యోతి): మునిసిపల్ కార్పొరేషన్లలో పాలకవర్గం పదవీ కాలం ముగిసినా కార్పొరేటర్లకు మాత్రం పదవిపై మోజు తీరలేదని, నేటికీ తమ వాహనాలపై 'కార్పొరేటర్' అనే స్టిక్కర్ అంటించుకుని తిరుగుతున్నారని బడంగ్‌పేట్ కార్పొరేషన్‌కు చెందిన కాంగ్రెస్ నాయకులు విమర్శించారు. అధికారులు సదరు వాహనాలపై స్టిక్కర్లు తొలగించేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ మేరకు సోమవారం యూత్ కాంగ్రెస్ మహేశ్వరం నియోజకవర్గం అధ్యక్షుడు వల్లపు సుభాన్‌యాదవ్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు బడంగ్‌పేట్ మునిసిపల్ కమిషనర్ సరస్వతికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదవి ముగిసిన వెంటనే స్టిక్కర్లు తొలగించకుండా పలువురు కార్పొరేటర్లు అలాగే తిరుగుతున్నారని, దీనిని బట్టి వారికి పదవి మీద వ్యామోహం పోలేదని అర్థమవుతున్నదని ఎద్దేవా చేశారు. అధికారులు దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ బి.గోవర్ధన్‌రెడ్డి, పార్టీ నాయకులు సామ వరుణ్‌రెడ్డి, గుర్రం లక్ష్మీనరసమ్మ, భాస్కర్, వెంకటేశ్, శివ, నర్సింగ్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సుభాన్‌యాదవ్ తదితరులు

నాలుగు రోజుల్లో వివాహం.. అంతలోనే విషాదం .. యువకుడి బలవన్మరణం

● పెళ్లి భాజా మోగాల్సిన ఇంట్లో.. చావు డప్పు

● హైదరాబాద్‌లో ఆత్మహత్య చేసుకున్న నల్లగొండ జిల్లా వాసి

చింతపల్లి, జూలై 28(ఆంధ్రజ్యోతి): ఆ ఇంట్లో నాలుగు రోజుల్లో పెళ్లి భాజా మోగాల్సి ఉంది. బంధువులందరికీ శుభలేఖలు చేరాయి. ఇరు కుటుంబాల సభ్యులు పెళ్లి వేడుకల్లో నిమగ్నమయ్యారు. పెళ్లి భాజాలతో పాటు ఫంక్షన్‌హాల్ మాట్లాడారు. ఆహ్వానాలన్నీ పూర్తయ్యాయి. ఇంతలోనే విషాదం నెలకొంది. పెళ్లి పీటలు ఎక్కాల్సిన యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో స్వగ్రామం నల్లగొండ జిల్లా చింతపల్లి మండలంలోని పీకే. మల్లేపల్లి గ్రామంలో విషాదం నెలకొంది. కుటుంబసభ్యుల సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. పీ.కే.మల్లిపల్లి గ్రామానికి చెందిన ముచ్చర్ల నరసింహ, జంగమ్మ దంపతులకు ముగ్గురు కుమారులు కాగా హైదరాబాద్‌లో నివసిస్తున్నారు. మొదటి కుమారుడికి వివాహంకాగా, రెండో కుమారుడు ముచ్చర్ల అరుణ్(32) కొంత కాలంగా రంగారెడ్డి జిల్లా బీఎన్.రెడ్డినగర్(హైదరాబాద్)లో ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నాడు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం పొల్కంపల్లిలో స్థిరాస్తి వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అరుణ్‌కు రంగారెడ్డి జిల్లా యాచారం మండలంలోని నందివనపర్తి గ్రామానికి చెందిన యువతితో ఈ నెల 30వ తేదీన వివాహం జరగాల్సి ఉంది. హైదరాబాద్‌లో తాను అద్దెకు ఉంటున్న ఇంట్లో ఈ నెల 26వ తేదీ రాత్రి ఎవరూ లేని సమయంలో అరుణ్ ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. ఆదివారం హైదరాబాద్‌లోనే కుటుంబసభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. కొద్దిరోజుల్లో పెళ్లి పీటలపై కూర్చోవాల్సిన అరుణ్ విగతజీవిగా మారాడని తెలుసుకున్న గ్రామస్థులు సైతం కన్నీరుమున్నీరయ్యారు.

అక్షిత్‌రెడ్డి మృతదేహం వెలికితీత

రాజేంద్రనగర్ : హిమాయత్‌సాగర్ నుంచి బాపూఘాట్ వరకు ఉన్న ఈసా కాలువ మొండి కత్వ వద్ద ఆదివారం స్నేహితులతో కలిసి ఫొటోలు దిగడానికి వెళ్లి గల్లంతైన అక్షిత్‌రెడ్డి(20) మృతదేహాన్ని సోమవారం డీఆర్‌ఎఫ్ సిబ్బంది బయటకు తీశారు. ఉస్మానియా మార్చురీలో పోస్టుమార్టం అనంతరం యువకుని మృతదేహాన్ని రాజేంద్రనగర్ పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించారు. జీడిమెట్ల జగద్గిరిగుట్ట ప్రాంతానికి చెందిన రవీందర్‌రెడ్డి కుమారుడు అజీజ్‌నగర్‌లోని వీజేఐటీలో బీటెక్ 3వ సంవత్సరం చదువుతున్న అక్షిత్‌రెడ్డి తనస్నేహితులైన రోహిత్, పవన్, అనిల్‌తో కలిసి రాజేంద్రనగర్ సర్కిల్ జన చైతన్య వాటర్ ఫాల్స్‌ను చూడటానికి వెళ్లి ఫొటోలు దిగుతూ ఈసా కాలువలో పడిన విషయం తెలిసిందే. కుమారుని మృతదేహాన్ని చూసి అక్షిత్‌రెడ్డి తండ్రి రవీందర్‌రెడ్డి బోరున విలపించారు.

ఏ పార్టీ అయినా సంక్షేమ పథకాలను స్వాగతించాల్సిందే

● మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి

● బాలాపూర్‌లో కొత్త రేషన్ కార్డులు పంపిణీ

సరూర్‌నగర్, జూలై 28(ఆంధ్రజ్యోతి): అధికారంలో ఉన్న ప్రభుత్వం ప్రజల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఏ పార్టీ అయినా స్వాగతించాల్సిందేనని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి అన్నారు. పథకాల విషయంలో విమర్శలు చేసుకుంటూ పోతే అర్హులైన పేద, బడుగు వర్గాల ప్రజలకు అన్యాయం జరుగుతుందని ఆమె వ్యాఖ్యానించారు. మహేశ్వరం నియోజకవర్గంలోని బాలాపూర్ మండలంలో కొత్తగా దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు మంజూరైన రేషన్ కార్డులను సోమవారం బడంగ్‌పేట్‌లోని ప్రజాభవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టీయూఎఫ్ఐడీసీ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డితో కలిసి ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో రేషన్ కార్డులు మంజూరు చేయలేదనడం అవాస్తవమని, ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగుతూనే ఉన్నదని, బీఆర్ఎస్ ప్రభుత్వం సైతం ఒక్క రంగారెడ్డి జిల్లాలోనే దాదాపు 90వేల కొత్త రేషన్‌కార్డులను మంజూరు చేసిందని గుర్తు చేశారు. ఇక ముందు సైతం రేషన్‌కార్డుల జారీ ప్రక్రియను కొనసాగించాలని, అర్హులైన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు. గతంలో వైఎస్ సీఎంగా ఉన్నప్పుడు ఉమ్మడి రాష్ట్రంలో అమలైన ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ పథకాలను బీఆర్ఎస్ హయాంలో మాజీ సీఎం కేసీఆర్ అలాగే కొనసాగించారని సబిత గుర్తు చేశారు. టీయూఎఫ్ఐడీసీ చైర్మన్ చల్లా మాట్లాడుతూ గత కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనే రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని, మళ్లీ ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలోనే సదరు రెండు పథకాలు విజయవంతంగా అమలవుతున్నాయని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రేషన్ షాపుల్లో ఇచ్చిన దొడ్డు బియ్యం దళారుల చేతుల్లోకి వెళ్తే.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తున్న సన్నబియ్యంలో ప్రతి గింజా లబ్ధిదారుడి ఇంట్లోకే వెళ్తున్నదని ఆయన అన్నారు. కార్యక్రమంలో బడంగ్‌పేట్ మునిసిపల్ కమిషనర్ పి.సరస్వతి, బాలాపూర్ డిప్యూటీ తహసీల్దార్ మణిపాల్‌రెడ్డి, ఆర్ఐ ప్రశాంతి, భాగ్యనగర్ రైతు సహకార సంఘం చైర్మన్ మర్రి నర్సింహారెడ్డి, గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ బోయపల్లి గోవర్ధన్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది, కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పన్నెండేళ్ల తర్వాత కొత్త రేషన్‌కార్డులు చరిత్రాత్మకం

దాదాపు పన్నెండేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత తెలంగాణ ప్రజలకు మళ్లీ కొత్త రేషన్ కార్డులు జారీ చేయడం చరిత్రాత్మకమని బడంగ్‌పేట్ కార్పొరేషన్ మాజీ మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి అన్నారు. సోమవారం బాలాపూర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తమ మంత్రివర్గంతో కలిసి కొత్త కార్డుల జారీ/పంపిణీకి తీసుకున్న నిర్ణయంతో అర్హులందరికీ న్యాయం దక్కినట్టయిందని అన్నారు. పాత, కొత్త కార్డులదారులందరికీ సన్నబియ్యం ఇవ్వడం దేశంలో ఎక్కడాలేని సరికొత్త పథకమని, ప్రజా ప్రభుత్వం పేదల కోసం పని చేస్తున్నదనడానికి ఇది ప్రత్యక్ష నిదర్శనమని పారిజాతారెడ్డి అన్నారు. అర్హులైన పేదలు ఎవరైనా ఉంటే రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు.



లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి, టీయూఎఫ్ఐడీసీ చైర్మన్ నర్సింహారెడ్డి